క్లుప్తంగా

'సాంకేతిక విద్య అందిస్తాం'



ఏఐ తరగతులు ప్రారంభిస్తున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య అందిస్తామని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. సోమవారం మండలంలోని తాటిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని 3, 4, 5వ తరగతుల్లో సామర్థ్యాలలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాల కమిటీ చైర్మన్ సునీత, హెచ్ఎం రవీంద్రచారి, ఉపాధ్యాయులు రమేశ్, శారద, విఠల్, సీఆర్పీ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కెరమెరి: మండలంలోని ఎస్సీ కాలనీలో ఉన్న తాగునీటి సమస్య తీర్చాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శి గణేశ్‌కు వినతిపత్రం అందించారు. అధికారులు స్పందించి బోరుకు మోటారు బిగించాలని కోరారు. నాయకులు వెంకటేశ్, అశోక్, శంకర్, మహేశ్, అజయ్, శేఖర్, వెంకటి, స్వామి తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

పెంచికల్‌పేట్: మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని పేర్కొన్నారు. ఎస్సై అనిల్ కుమార్, హెచ్ఎం విజయ నిర్మల, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాల అమలుకు సహకరించాలి



ఎస్పీకి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లాలో ఆదివాసీ చట్టాల అమలుకు పోలీసులు సహకరించాలని కోరుతూ సోమవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఎస్పీని శాలువాతో సన్మానించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసీల జిల్లా వెనకబడి ఉందని, పోలీసుల ఆధ్వర్యంలోనే పరిష్కార మార్గాలు వస్తున్నాయన్నారు. పోలీసులపై అపారమైన నమ్మకం ఉందని, రాజ్యాంగ బద్ధమైన చట్టాల అమలుకు పోలీసులు ఎప్పటిలాగే సహకరించాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఆదివాసీ సంఘాల నాయకులు తుకారాం, కొట్నాక కిషన్, కుడ్మెత శంకర్, యావమ్‌రావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థినులు రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 9 నుంచి 12 వరకు మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ స్రవంతి తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరి, పీడీలు భవిత, లక్ష్మి, కోచ్ రవికుమార్ విద్యార్థినులను అభినందించారు.

మరుగుదొడ్ల ప్రారంభమెప్పుడో..?



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

- నిర్మాణం పూర్తయ్యి మూడు నెలలు
- ప్రారంభానికి నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ పరిధి బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికులు, వ్యాపారస్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన స్వచ్ఛభారత్ మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. సిర్పూర్(టి) నియోజకవర్గ కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రధాన రహదారిపైనే ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూస్తున్నారు. సిర్పూర్(టి) మండలం మీదుగా ప్రయాణాలు సాగిస్తున్న నియోజకవర్గ ప్రజలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర గ్రామాల ప్రజలు బస్టాండ్, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రభుత్వం స్వచ్ఛభారత్‌లో భాగంగా రూ.3 లక్షల నిధులు మంజూరు చేసి మరుగుదొడ్లు నిర్మించింది. వీటి నిర్మాణం పూర్తయ్యి మూడు నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు.

రోడ్డు లేక ఇబ్బందులు..

సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని బస్టాండ్ ప్రాంతంలో వారాంతపు సంతకు ఆనుకుని పక్కనే ఉన్న స్థలంలో స్వచ్ఛభారత్ మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించారు. నూతన నిర్మాణాలు పూర్తి అయినప్పటికీ అధికారులు ప్రారంభించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు మరుగుదొడ్లు, మూత్రశాలలను ప్రారంభించి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. అదేవిధంగా బస్టాండ్ ప్రాంతంలోని ప్రధాన రహదారి నుంచి మూత్రశాలల వరకు రోడ్డు వసతి లేకపోవడంతో మరుగుదొడ్లు ఎక్కడున్నాయో ప్రయాణికులకు కన్పించడం లేదు. మరుగుదొడ్ల వరకు రోడ్డు వసతి సైతం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

తిప్పలు పడుతున్నాం..



సిర్పూర్(టి) బస్టాండ్ ప్రాంతంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. మహిళల తిప్పలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రజల వినతుల మేరకు స్వచ్ఛభారత్ మరుగుదొడ్లు, మూత్రశాలలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి. – నాగేందర్, హుడ్కిలి

అధికారులు స్పందించాలి



మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరుగుదొడ్లు, మూత్రశాలలు ప్రారంభించి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలి. – కరుణాకర్, సిర్పూర్(టి)

డ్రెయినేజీ లేక తిప్పలు

లింగాపూర్ పోచమ్మనగర్‌లో రోడ్డుపై పారుతున్న నీరు





లింగాపూర్‌లో అధ్వానంగా పారిశుధ్యం

లింగాపూర్: మండలంలోని గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రధాన వీధులు, కాలనీల్లో డ్రెయినేజీలు లేక మురుగు నీరు రోడ్డుపైనే పారుతోంది. దీంతో మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని కోరుతున్నారు.



కొత్తపల్లి గ్రామంలో..



గోండుగూడలో పారుతున్న మురుగు నీరు

జీవో 282 రద్దు చేయాలి



ప్రతులు దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు



జిల్లాకేంద్రంలో..

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని గంటలను 10 గంటలకు పెంచుతూ తీసుకొచ్చిన జీవో నెం. 282ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో జీవో నెం 282 ప్రతులను దహనం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ రోజుకు 8 గంటల పని విధానాన్ని, 10 గంటలకు పెంచడం సరికాదన్నారు. ఈ నిర్ణయంతో 139 సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానానికి తూట్లు పొడిచారని ఆరోపించారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాయని విమర్శించారు. కార్మిక వ్యతిరేఖ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, ఆర్.త్రివేణి, జిల్లా కమిటీ సభ్యులు చంద్రయ్య, శంకర్, మల్లేశ్, అశోక్, లక్ష్మణ్, శ్రీనివాస్, సత్యం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: కార్మికుల పని గంటలు పెంచుతూ తెచ్చిన జీవో 282 రద్దు చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో సోమవారం కార్మిక సంఘాల నాయకులు, కార్మికులతో కలిసి జీవో ప్రతులు దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్, కార్మికులు సుధాకర్, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బీఎల్‌వో డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలి'



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కాగజ్‌నగర్‌టౌన్: బీఎల్‌వో డ్యూటీల నుంచి అంగన్వాడీలకు మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ మధుకర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మార్చి 12న డిప్యూటీ సెక్రటరీ అంగన్వాడీ సర్వీసెస్ మినిస్ట్రీ ఆఫ్ న్యూఢిల్లీ ఆదేశాల మేరకు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు బీఎల్‌వో డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని జీవో జారీ చేశారన్నారు. ఇప్పటికే అంగన్వాడీలు రకరకాల యాప్‌ల ద్వారా పనులు చేపడుతూ ఒత్తిడికి గురవుతున్నారన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అరుణ మైమన, సరస్వతి, జయ, రాజ్యలక్ష్మి, గంగాభవాని, శాంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

దహెగాం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మునవార్ షరీఫ్, ఏవో రామకృష్ణలు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను, గోదాంలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎరువుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో యూరియా, డీఏపీల వాడకం పెంచాలని పేర్కొన్నారు. ఎరువుల కొరత సృష్టిస్తే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఫర్టిలైజర్ దుకాణ యజమానులు ఉన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి



గోలేటి సీహెచ్‌పీలో అభివాదం చేస్తున్న నాయకులు

రెబ్బెన: కొత్త లేబర్ కోడ్‌లు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సింగరేణి కార్మికులు విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గేట్‌మీటింగ్ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లు మార్చి కార్పొరేట్, ప్రైవేటు పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. నాయకులు ఎస్.తిరుపతి, పేరం శ్రీనివాస్, మల్రాజు శ్రీనివాస్‌రావు, పత్తెం రాజాబాబు, బయ్యు మొగిళి, మణిరాం సింగ్, సంగెం ప్రకాశ్‌రావు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో వ్యవసాయ కార్మికులు, చిన్న,సన్నకారు రైతులు, కూలీలు పాల్గొనాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ సోమవారం తెలిపారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం రూ. 600లకు పెంచాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా 14 రకాల సరకులను అందజేయాలన్నారు. ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటి జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీ తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

వాంకిడి: భారతీయ బౌద్ధ మహాసభ, అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించనున్న 'బుద్ధుడితో నా ప్రయాణం' నాటికకు సంబంధించిన పోస్టర్లను తహసీల్దార్ కవిత, సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్‌లు సోమవారం ఆవిష్కరించారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ వారు ఈ నాటికను ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, ఎస్ఎస్‌డీ జిల్లా ఇన్‌చార్జి దుర్గం సందీప్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు దుర్గం దుర్గాజీ, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రె, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్: దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ చెల్లించాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇస్లాంబిన్ హసనస్ మాట్లాడుతూ తీవ్ర వైకల్యం ఉన్న వారికి నెలకు రూ.15 వేలు చెల్లించాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. నాయకులు బన్నమూర్తి, రాజయ్య, రమేశ్ ఉన్నారు.

ఆపిల్ తోటను సందర్శించిన సివిల్ జడ్జి



ఆపిల్ తోట పరిశీలిస్తున్న జడ్జి

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామంలోని కేంద్రె బాలాజీకి చెందిన ఆపిల్ తోటను సోమవారం ఆసిఫాబాద్ కోర్టు సివిల్ జడ్జి యువరాజ సందర్శించారు. ఆపిల్ తోటలతో పాటు ఆపిల్ బేర్ వంటి కొత్తతరం, ఇతర పంటలను పరిశీలించారు. సాగు విధానాన్ని రైతును అడిగి తెలుసుకున్నారు. కాత, పూత విక్రయం తదితర విషయాలపై ఆరా తీశారు. సేంద్రియ రైతులు జడ్జిని సన్మానించారు. ఎస్సై మధుకర్ ఉన్నారు.

అమలుకు నోచుకోని మెనూ

చింతలమానెపల్లి: ఆశ్రమ పాఠశాలల్లో భోజన మెనూ అమలు చేయడం లేదు. కేతిని ఆశ్రమ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి భోజనంలో గుడ్లు అందించడం లేదు. ఆదివారం భోజనంలో చికెన్ పెడుతున్నా చికెన్ తినని విద్యార్థులకు పప్పును భోజనంలో అందిస్తున్నారు. నిబంధనల ప్రకారం చికెన్ తినని విద్యార్థులకు మిల్‌మేకర్ లేదా కూరగాయలను భోజనంలో ఇవ్వాలి. మెనూ అమలు చేయకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.



పప్పుతో భోజనం చేస్తున్న విద్యార్థి

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు, డీఎంహెచ్‌వో, మిషన్ భగీరథ ఈఈలతో పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో మురుగు కాల్వలు ప్రతీరోజు శుభ్రం చేయాలని, అంతర్గత రహదారుల్లో గుంతలు పూడ్చి, నీటి నిలవ్వలు నివారించాలన్నారు. నీటి నిల్వల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని, దోమల నివారణకు ఆయిల్ బాల్స్, బయోటిక్ స్ప్రే పిచికారీ చేయాలన్నారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రైడే నిర్వహణలో భాగంగా ప్రతీ ఇంటిని సందర్శించి ట్యాంకులు, ఇతర సామాన్లలో నిల్వ నీటిని తొలగించే విధంగా ఇంటి యజమానులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మంచినీటి ట్యాంకులను సకాలంలో శుభ్రం చేయాలని, ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలని తెలిపారు. వైద్యారోగ్య సిబ్బంది ప్రతిరోజు గ్రామాలను సందర్శించి, సీజనల్ వ్యాధులపై వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. పీహెచ్‌సీల్లో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలకు 500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని పేర్కొన్నారు. ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డీఎంహెచ్‌వో సీతారాం, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ , మిషన్ భగీరథ ఈఈ సిద్దిఖీ, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు గజానంద్, అంజయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



దహెగాం: జెండా ఎగురవేస్తున్న నాయకులు

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేశారు. మండలంలోని పీపీరావు కాలనీలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి మహేశ్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఆయిళ్ల శంకర్, చాపల శంకర్, నాయకులు రాజ్‌కుమార్, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంతో మండలంలోని వీర్దండి గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేసి, వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఇగురపు విఠల్, నాయకులు పిట్టల సత్యనారాయణ, శంకర్, మల్లేశ్, సుదర్శన్, బిక్షపతి, గజానన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం మండల కేంద్రంలో సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండా ఎగురవేశారు. సంఘం అధ్యక్షుడు పొర్ల వెంకటేశ్, మహేశ్, అశోక్, శంకర్, దుర్గయ్య, శ్రీనివాస్, రఘునాథ్, రాంచందర్, గోగర్ల రాజయ్య, వినిశ్, శ్రీకాంత్, కళ్యాన్ రాజన్న, రవీందర్ ఉన్నారు.

ఆసిఫాబాద్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని బాబూజగ్జీవన్‌రాం చౌక్ వద్ద ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

9న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఈ నెల 9న ఉదయం 10 గంటలకు విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కానోజి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ సిటిజన్ కార్డు లేని వారు రెండు ఫోటోలు, ఆధార్ కార్డు వెంట తీసుకొని రావాలని సూచించారు.

బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ

లింగాపూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఓటరు జాబితాపై బూత్‌స్థాయి అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం శిక్షకులు సాయితేజ, లింగమూర్తిల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ నాగరాజు గౌడ్, ఆర్ఐ ప్రదీప్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు

చింతలమానెపల్లి: పోలీసుల ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఈనెల 9, 10వ తేదీలలో మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది దివాకర్‌ను 7989718811లో సంప్రదించాలని సూచించారు.